క్లుప్తంగా

నాణ్యతతో సీసీ రోడ్ల నిర్మాణం



సీసీ రోడ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు

కళ్యాణదుర్గం: సీసీ రోడ్లను నాణ్యతతో నిర్మిస్తామని మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి అన్నారు. స్థానిక పాత ఆంధ్రబ్యాంక్ సమీపం నుంచి ముదిగల్లు రహదారి వరకూ మంజూరైన నూతన సీసీ రోడ్డు పనులను మంగళవారం ప్రారంభించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రూ.10 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. అనంతరం మున్సిపల్ ఏఈ షబానా, వార్డు సచివాలయ కన్వీనర్ ఉమేష్, మున్సిపల్ సిబ్బంది పనులను పరిశీలించారు. నాణ్యతలో రాజీ పడకూడదని ఏఈ సూచించారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



కాలువపల్లిలో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ అధికారులు

బెళుగుప్ప: ఖరీప్‌లో పంటలు సాగు చేసిన చేసిన ఈ నెల 30లోగా తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏఓ పృథ్వీసాగర్ సూచించారు. కాలువపల్లిలో వీహెచ్ఏ రోజాతో కలసి మంగళవారం ఆయన రైతులు సాగు చేసిన వివిధ పంటలకు ఈ-క్రాప్ బుకింగ్ నమోదు చేయించారు. ఈనెల 15 లోగా ఈ-క్రాప్ నమోదు పూర్తి చేయాలన్నారు. మండలంలో 17,635 ఎకరాల్లో పంటలు సాగు చేయగా మంగళవారం నాటికి 10,880 ఎకరాలను ఈ-క్రాప్ బుకింగ్ చేశామన్నారు. మిగిలిన రైతులు త్వరితగతిన ఈక్రాప్ నమోదు చేసుకోవాలన్నారు.

కుందుర్పి: ఈ నెల 15లోపు ఖరీప్‌లో పంటలు సాగుచేసిన రైతులు ఈ-క్రాప్ చేయించుకోవాలని కళ్యాణదుర్గం వ్యవసాయశాఖ సంచాలకుడు యల్లప్ప మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే డివిజన్ వ్యాప్తంగా 60 శాతం ఈ-క్రాప్ నమోదు పూర్తి చేశామన్నారు.

అవయవ దానంపై చైతన్యం కావాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జయరామిరెడ్డి

కళ్యాణదుర్గం: అవయవ దానంపై ప్రజలు చైతన్యం కావాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయరామిరెడ్డి అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథకం, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు రక్తదానం, నేత్రదానం, అవయవదానం, శరీరదానం ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అవయవదానం గురించి ప్రజలకు యువత వివరించాలన్నారు. జేవీవీ మల్లికార్జున మాట్లాడుతూ కళ్ల దానంపై ప్రతిఒక్కరూ అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు జీఎల్ఎస్ ప్రసాద్, అమ్మ నేత్రదాన ప్రోత్సాహక సంఘం సలహాదారు సుబ్బరాజు, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ శ్రీధర్, అమ్మ సంస్థ ప్రతినిధులు ఈశ్వర్, లింగరాజు, జేవీవీ మాజీ ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాపారులకు అవగాహన



మాట్లాడుతున్న ఆర్టీసీ అధికారులు

కళ్యాణదుర్గం: స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీ వెనుక ఉన్న ఖాళీ స్థలంలో 15 ఏళ్ల పాటు లీజుకు ఇవ్వడానికి ఆసక్తి గల వ్యాపారస్తులతో ప్రీ బిడ్డింగ్‌పై ఆర్టీసీ అధికారులు అవగాహన కల్పించారు. డిపో ఆవరణలో మంగళవారం డీఎం రామచంద్ర అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎం సుమంత్ ఆదోని, డిప్యూటీ సీటీఎం రమేష్ బాబు, ఏఈ (సివిల్) వెంకటేశ్వరరావు ప్రీ బిడ్‌పై వివరించారు. ఆర్టీసీ గ్యారేజ్ పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని లీజుకు ఇస్తామన్నారు. కార్యక్రమంలో 15 మంది వ్యాపారుల పాల్గొన్నారు.

వేళకు బస్సులు నడపాలని వినతి

కుందుర్పి: కళాశాలలు, పాఠశాలల ప్రారంభ సమయానికి స్సులు నడపాలని మంగళవారం కళ్యాణదుర్గం డిపోలోని ఆర్టీసీ అధికారులను విద్యార్థి సంఘాల నాయకులు వినతి పత్రం అందజేశారు. కర్ణాటక సరిహద్దున ఉన్న కుందుర్పి మండలంలోని నాగేపల్లి, మలయనూరు, వడ్డెపాళ్యం, మాయదార్లపల్లి, కలిగోలిమి, జంబుగుంపల తదితర గ్రామాలకు బస్సు సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యాలయాల ప్రారంభ సమయానికి బస్సులు నడపాలని విద్యార్థి సంఘాలు , విద్యార్థులు తల్లిదండ్రులు కోరారు.

అభివృద్ధి, సంక్షేమమే సీఎం ధ్యేయం

- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

కణేకల్లు: అభివృద్ధి, సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని యర్రగుంట గ్రామంలో మంగళవారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. రెడ్ క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి, మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ యంద్రకాయల వన్నూరప్ప, వైఎస్సార్‌సీపీ నాయకుడు కెనిగుంట రామిరెడ్డి, అధికారులు, వలంటీర్లతో కలసి విప్ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ పంపిణీ చేశారు. అయన మాట్లాడుతూ అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, ఆరోగ్యశ్రీ, జగనన్న చేదోడు, జగనన్న విద్యాకానుక, వసతిదీవెన... ఇలాంటి మరెన్నో పథకాలు కొనసాగి మనతోపాటు పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే మరోమారు జగనన్నను సీఎంగా గెలుపించుకోవాలన్నారు.

దోపిడీదారుడు చంద్రబాబు

40 ఏళ్ల ఇండ్రస్టీ, 14 ఏళ్లు సీఎం... నేను నిప్పునంటూ ప్రగల్బాలు పలికే చంద్రబాబు రూ.371 కోట్ల ప్రజాధనం దోపిడీ చేసిన దుర్మార్గుడు, నీచడని విప్ మండిపడ్డారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో రూ.కోట్లు కొల్లగొట్టాడన్నారు. దోపిడీదారులెవరో? ప్రజల బాగు కోరేదెవరో రాష్ట్ర ప్రజలకు తెలిసిందన్నారు. చంద్రబాబుతోపాటు గతంలో మంత్రిగా ఉన్న కాలువ శ్రీనివాసులు సైతం ఎక్కడ అవకాశముంటే అక్కడ దోచేశారన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలో 'నీరు-చెట్టు' పథకంతోపాటు ఇసుక దందాలో కోట్లాది రూపాయలు దోచేశారన్నారు.

పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వండి

సొంత స్థలాల్లో ఇల్లు నిర్మించుకోవాలనుకునే వారికి ఇల్లను మంజూరు చేయిస్తామని విప్ కాపు స్పష్టం చేశారు. 'గడప గడప'కూ మన ప్రభుత్వ కార్యక్రమం తర్వాత విప్ కాపు అధికారులతో అక్కడే సమీక్ష సమావేశం నిర్వహించారు. చాలా మంది స్థలం ఉంది... ఇల్లు మంజూరు చేయమని కోరిన విషయాన్ని విప్ అధికారులతో చర్చించారు. ఇలాంటి వారు ఎంత మంది ఉన్నారో గుర్తించండి... ఎవరెవరికీ పొజిషన్ సర్టిఫికెట్లు అవసరమో జాబితా తయారు చేసి.. వారందరికీ సర్టిఫికెట్లు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సంధ్య, తహసీల్దార్ రజాక్‌వలి, ఎంపీడీఓ పీడీ శ్రీనివాసులు, ఈఓఆర్‌డీ గూడెన్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, మాజీ అధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, మండల జేసీఎ కన్వీనర్ హనుమంతరావు, వైస్ సర్పంచు సునీతమ్మ, ఎంపీటీసీ నాగరాజు, మాజీ సర్పంచు భీమప్ప, నాయకులు గొల్ల భీమిరెడ్డి, గాని శ్రీనివాసరెడ్డి, పీ.శ్రీనివాసరెడ్డి, సంజీవరెడ్డి, సోంశేఖర్‌రెడ్డి, కేజీ ఈరన్న, గోవర్ధన్‌రెడ్డి, కె.అశోక్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని గ్రామాలకూ సీసీ రోడ్లు



బోయలపల్లిలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం రూరల్: గ్రామాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మిస్తామని రాష్ట్ర స్త్రీ ,శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. మండలంలోని బోయలపల్లిలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంత్రి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పనులు చేస్తుందన్నారు. అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లతో పాటు డ్రైనేజీలను నిర్మిస్తామన్నారు. గడప గడపలో ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి పనులను చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సర్వోత్తమ, సచివాలయాల కన్వీనర్ ఆంజనేయులు, నాయకులు మల్లన్న, హనుమంతరాయుడు, తిమ్మరాజు, జైపాల్‌రెడ్డి, తిప్పన్న, నాగేంద్ర, రామాంజినేయులు, మల్లికార్జునలతో పాటు పలువురు పాల్గొన్నారు.

నేమకల్లులో 'శ్రావణ' పూజలు



అలంకరణలో ఆంజనేయస్వామి

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. శ్రావణమాసం చివరి మంగళవారం సందర్భంగా మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలకరించారు. ప్రధాన అర్చకుడు అనిల్‌కుమార్ స్వామి ఆధ్వర్యంలో పురోహితులు వేకువజాము నుంచే స్వామికి కుంకుమార్చన, వెండి కవచధారణ, వెండి తమలపాకు అలంకరణ, ఆకుపూజలు, తులసీ మాలధారణ, ప్రత్యేక పుష్పాలకరణ నిర్వహించి మహామంగళహారతి నిర్వహించారు. కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ ఆర్టీసీ డిపోల నుంచి హనుమాన్‌దర్శన్ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో వందలాది మంది భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్నం ఇటు మురడి నుంచి, అటు కసాపురం నుంచి వచ్చిన వాహనాలు నేమకల్లులో కలవడంతో తీవ్ర రద్దీ ఏర్పడింది. బళ్లారికి చెందిన గణేష్ గార్మెంట్స్ యజమానులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పోలీసులు బందోబస్తు పర్యవేక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ పరమేశ్వర పాల్గొన్నారు.

ఘనంగా మారెమ్మ జాతర



అమ్మవారిని దర్శించుకున్న మంత్రి

బ్రహ్మసముద్రం: మండలంలోని నాగిరెడ్డిపల్లిలో మంగళవారం మారెమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. సాయంత్రం రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్, మండల నాయకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, గ్రామోత్సం తదితర కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రభావతి, ఏడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ రామాంజనేయులు, ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ బసవరాజు, రైతు సంఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ లోకేష్, సర్పంచులు ప్రేమ, మంజునాథ్, నాయకులు పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, హనుమంతరెడ్డి, బాదపల్లెప్ప, ఎల్లప్ప, గోపాల్, శంకర్‌నాయక్ తదితరులు ఉన్నారు.

చిన్నారికి డెంగీ

ఉరవకొండ: మండలంలోని చిన్నముస్టూరు గ్రామానికి చెందిన ఐదేళ్ల బాలుడు వడ్డే సుదర్శన్ డెంగీ బారిన పడ్డాడు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ అమృతరాజ్, ఉరవకొండ మలేరియా సబ్ యూనిట్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి, సర్పంచ్ రామాంజనేయులు తదితరుల ఆధ్వర్యంలో గ్రామంలో విస్తృతంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వీడాలి

ఉరవకొండ(వజ్రకరూరు): ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు, సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వీడాలని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి సూచించారు. మంగళవారం వజ్రకరూరు మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ భవనంలో చిన్నహోతూరు, పెద్దహోతూరు, గూళపాల్యం సచివాలయాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీపీ రమావత్‌దేవిబాయి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా జరైన మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను ఎంత వరకూ పరిష్కరించారు? గుర్తించిన ముఖ్యమైన పనులు ఏ స్థాయిలో ఉన్నాయంటూ అధికారులను ప్రశ్నించారు. చాలా మంది అధికారులు ఏడాది అయినా గడప గడపలో గుర్తించిన పనులు పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. అలాగే జగనన్న కాలనీల్లోని ఇంటి నిర్మాణాల్లో వెనుకబడి ఉన్నామన్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాల్సిన బాధ్యత సచివాలయ ఉద్యోగులు, హౌసింగ్ అధికారులదే అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలలిత, వైఎస్ ఎంపీపీ సుశీలారాణి, నాయకులు వెంకటరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సుధీర్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, సామానాయక్, కమలపాడు సర్పంచ్ తిరకమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న విశ్వ

చంద్రబాబు స్కిల్డ్ క్రిమినల్

స్కిల్ స్కాంలో నెం1 క్రిమినల్ చంద్రబాబే అని విద్యార్థులు, నిరుద్యోగుల పేరుతో రూ371 కోట్లను పలు షెల్ కంపెనీలకు మళ్లించి దోపిడీ చేశారని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం వజ్రకరూరు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు సాక్ష్యాధారాలతో పట్టుబడినా యుగపురుషుడిలా ఫోజులు కొట్టడం హాస్యస్పందగా ఉందన్నారు. పేదలకు సీఎం వైఎస్ జగన్ చూస్తున్న మంచిని చూసి జీర్ణించుకోలేక టీడీపీ పార్టీ, నారా లోకేష్ నిత్యం అభాండాలు వేస్తు కట్టుకథలు ప్రచారం చేస్తున్నారన్నారు. సోమవారం టీడీపీ పిలుపునిచ్చిన రాష్ట్ర బంద్ అభాసుపాలయిందని, బంద్‌లో టీడీపీ నాయకులే పాల్గొనలేదన్నారు. చంద్రబాబు అవినీతికి పాల్పడి జైలు పాలయ్యాడని ప్రజలు పూర్తిగా నమ్ముతున్నారని, అందుకే బంద్‌కు ప్రజలు ఇవ్వలేదన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్ఎఫ్) నుంచి మంజురైయిన చెక్కులను మంగళవారం మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వజ్రకరూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రమావత్ దేవిబాయి, వైస్ ఎంపీపీ సుశీలారాణి, సర్పంచ్ మోనాలీసాతో కలసి ఆయన మజ్రకరూర్‌కు చెందిన శివప్రసాద్‌రెడ్డికు రూ.4 లక్షలు, కలమపాడు గ్రామానికి చెందిన తిరకమ్మకు రూ.35 వేల విలువ చేసే చెక్కులను అందించారు. కార్యక్రమంలో వైఎస్సాఆర్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

250 మందికి ఉద్యోగావకాశాలు



జాబ్‌మేళాలో ఆఫర్ లెటర్స్‌తో కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపక బందం

గుమ్మఘట్ట(రాయదుర్గం రూరల్): అందివచ్చిన ప్రతి అవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ రఘురామమూర్తి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్, కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా మంగళవారం నిర్వహించారు. 15 కంపెనీల ప్రతినిధులు హాజరు కాగా, 450 మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎంపికైన వారికి నెలకు రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకూ వేతనం ఉంటుందన్నారు. అనంతరం 250 మంది అభ్యర్థులకు ఆఫర్ లెటర్స్‌ను అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్,అనంతపురం జిల్లా నైపుణ్యాభివద్ధి సంస్థ ప్రతినిధి ఆనంద్‌రాజ్‌కుమార్, కళాశాల నైపుణ్యాభివృద్ధి సంస్థ కోఆర్డినేటర్స్ వనిత, ఎం.రాము, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడి మృతి



మృతి చెందిన గిరిధర్‌బాబు

బొమ్మనహాళ్: మద్యం తాగవద్దని భార్య మందలించడంతో ఆత్మహత్యకు యత్నించిన భర్త చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని బొల్లనగుడ్డం గ్రామంలో చోటు చేసుకుంది. బొమ్మనహాళ్ ఎస్‌హెచ్ఓ హనుమంత నాయక్ తెలిపిన వివరాల మేరకు.. గిరిధర్ బాబు (31) మద్యానికి బానిసయ్యాడు. ఈ విషయమై ఈనెల 9న భార్య గొడవపడి పుట్టింటికి వెళ్లింది. మనస్థాపానికి గురైన గిరిధర్‌బాబు ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి ఉరి తాడుకు వేలాడుతున్న గిరిధర్‌బాబును కిందకు దింపారు. అప్పటికి అతడు బాగుండడంతో అందరూ ఊపిరి పీలుచుకున్నారు. రాత్రి సమయంలో గొంతువాపు రావడంతో ఉదయమే బళ్లారి విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడికి భార్య అనుష, ఇద్దరు కుమారులున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్ఓ తెలిపారు.

అర్హతే.. పింఛన్‌కు ప్రామాణికం

- నేడు కొత్త పింఛన్లు పంపిణీ చేయనున్న విప్

రాయదుర్గంటౌన్: 'కులమేదైనా..మతమేదైనా.. ఏ పార్టీకి చెందిన వారైనా సరే .. అర్హత ఉంటే చాలు.. ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందిస్తాం' అంటూ ఇచ్చిన హామీని ఆచరణలో చేసి చూపిస్తున్నారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం, పక్షపాతం, అవినీతికి తావులేకుండా అత్యంత పారదర్శక విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ప్రతినెలా 1వ తేదీ నుంచే ఇంటి వద్దకే వలంటీర్లు విచ్చేసి పింఛన్ సొమ్ము అందజేస్తుండగా లబ్ధిదారుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

నేడు 386 మందికి కొత్త పింఛన్ల పంపిణీ

రాయదుర్గం పట్టణంలో 386 మందికి ఈ నెల నుంచి ప్రభుత్వం వివిధ రకాల కొత్త పింఛన్లు మంజూరు చేసింది. కొత్తగా పింఛన్లను కలుపుకుని పట్టణంలోని 18 సచివాలయాల పరిధిలోని 32 వార్డుల్లో మొత్తం 6,829 మందికి వివిధ రకాల పింఛన్లకు గాను రూ.1.96 కోట్ల లబ్ధి చేకూరుతుంది. కొత్త పింఛన్లను బుధవారం ఉదయం 11.30 గంటలకు పట్టణంలోని బళ్లారి రోడ్డు వైఎస్సార్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి హాజరై పంపిణీ చేయనున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కౌన్సిలర్లు హాజరవుతారని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు.

సంక్షిప్త సమాచారం

16న పాత రాళ్ల వేలం

కణేకల్లు: కణేకల్లులోని సంజయ్‌నగర్ ప్రాథమిక పాఠశాలకు చెందిన పాత భవనాల రాళ్లను 16న వేలం వేయనున్నట్లు స్కూల్ కమిటీ చైర్మన్ ఆంజినేయులు, హెచ్ఎం కల్పన మంగళవారం తెలిపారు. 'నాడు-నేడు' కింద కొత్త భవనాలు మంజూరు కావడంతో పాత భవనాలను ఇటీవల కూల్చేశామన్నారు. ఈ రాళ్లను పేరెంట్స్ కమిటీ తీర్మాణం మేరకు శనివారం ఉదయం 10 గంటలకు పాఠశాల ఆవరణలో వేలం వేస్తామని, ఆసక్తి ఉన్న వారు హాజరు కావాలన్నారు.

తక్షణ సాయం అందజేత

కళ్యాణదుర్గం: స్థానిక 13వ వార్డులో నివాసముంటున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త పీట్ల హనుమన్న రెండు రోజులక్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ 13వ వార్డు కౌన్సిలర్ గంగమ్మ, కో ఆప్షన్ సభ్యుడు సల్లా మారుతి బాధిత కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ ఆదేశాల మేరకు వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సాయం రూ.10 వేలు మృతుని భార్య నందినికి అందజేశారు. మిగిలిన మొత్తం ఆమె బ్యాంకు ఖాతాకు జమ అవుతుందన్నారు. డీలర్ రాజు, ఆర్‌పీ ఐరమ్మ, నాయకులు మురళి, వెంకటేశులు, శ్రీకాంత్, రమేష్, సరస్వతమ్మ పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

కణేకల్లు: మండలంలోని యర్రగుంటలో బుధవారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి మంగళవారం తెలిపారు. ఉదయం 6 గంటలకు విప్ కాపు రామచంద్రారెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని, ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరు కావాలన్నారు.

3 నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష'

కూడేరు: మండలంలో అక్టోబర్ 3 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎంకే బాషా మంగళవారం తెలిపారు. 3న గొటుకూరులో సచివాలయం వద్ద, 5న ఇప్పేరు, 6న కమ్మూరు, 7న కొర్రకోడు, 10న కూడేరు, 12న మరుట్ల-2, 13న ఉదిరిపికొండ, 17న కరుట్లపల్లి, 19న చోళసముద్రం, 20న నారాయణపురంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. వైద్య శిబిరాలు నిర్వహించే 15 రోజులు ముందు ఆ సచివాలయ పరిధిలో ప్రతి ఇంటా సీహెచ్ఓ, ఏఎన్ఎం, వలంటీర్ తిరిగి ఆరోగ్య సమస్యలు తెలుసుకుంటారన్నారు. గుర్తించిన సమస్యలకు వైద్య శిబిరంలో చికిత్స అందజేస్తారన్నారు.

నేడు శిక్షణ

గుమ్మఘట్ట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమంపై శిక్షణ కల్పిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి మంగళవారం తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది హాజరు కావాలని ఆయన కోరారు.

జాగ్రత్తలతో అంగ వైకల్యాన్ని అరికట్టవచ్చు

కూడేరు: కుష్టు వ్యాధిగ్రస్తులు ముందు జాగ్రత్తలు పాటిస్తే అంగవైకల్యం బారిన పడకుండా అరికట్టవచ్చని జిల్లా పారా మెడికల్ ఆఫీసర్(డీపీఎంఓ) తిప్పేస్వామి సూచించారు. మండలంలోని కుష్టు రోగుల కాలనీలో మంగళవారం అంగవైకల్య నివారణ, వైద్య పునరావాస కార్యక్రమాన్ని వైద్యాధికారులు నిర్వహించారు. కుష్టు వ్యాధిగ్రస్తులు చేయి, కాళ్ల వేళ్లకు పుండ్లు కాకుండా రోజూ టబ్‌లో నీరు పోసి, అందులో చేతులు, కాళ్లు ఉంచి సబ్బుతో ఎ లా శుభ్రం చేసుకోవాలో ఆయన అవగాహన కల్పించారు. అనంతరం వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ముందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వరలక్ష్మి, సూపర్‌వైజర్ రవీంద్ర, ఏఎన్ఎం భాను, ఆశావర్కర్లు రామాంజనమ్మ, పెద్దక్క తదితరులు పాల్గొన్నారు.

ఈఓఆర్డీగా రంగనాయకులు

రాయదుర్గం: మండలం ఈఓఆర్డీగా రంగనాయకులు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కర్నూలు జిల్లా నుంచి పదోన్నతి పై ఇక్కడికి వచ్చినట్టు ఎంపీడీఓ కొండన్న తెలిపారు. ఈ సందర్భంగా ఈఓఆర్డీ మాట్లాడారు.. మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచడంతో పాటు సర్పంచులు, కార్యదర్శులను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతామన్నారు. అనంతరం ఆయన ఎంపీపీ విద్యావతి, ఎంపీడీఓను కలిశారు.

పోటాపోటీగా స్కూల్ గేమ్స్



బెళుగుప్ప: లాంగ్‌జంప్‌లో పాల్గొన్న విద్యార్థులు



కూడేరు: కబడ్డీ పోటీలో పాల్గొన్న విద్యార్థినులు

బెళుగుప్ప/కూడేరు/శెట్టూరు/గుమ్మఘట్ట: బెళుగుప్ప మండల కేంద్రంలోని ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్కూల్ గేమ్స్ పోటీపోటీగా సాగాయి. ప్రధానోపాధ్యాయుడు వెంకటప్రసాద్, పీఈటీలు నిర్వహించిన మండల స్థాయి అండర్-14, -17 పోటీలను ఎంఈఓలు మల్లారెడ్డి, హరికృష్ణ ప్రారంభించారు. మండల స్థాయిలో వాలీబాల్, కబడ్డీ, బాల్ బాడ్మింటన్, త్రోబాల్, టెన్నికాయిట్, షటిల్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయి పోటీలు రాష్ట్ర స్థాయికి ఎంపికవుతారని ఎంఈఓలు తెలిపాన్నారు. కార్యక్రమంలో పీఈటీలు సిద్దన్న, రాజశేఖర్, రఘు, మల్లోబన్న, తిమ్మరాజు, రాదాకృష్ణ, అమర తదితరులు పాల్గొన్నారు. అలాగే కూడేరు మండలంలోని మరుట్ల-2 హైస్కూల్ వద్ద మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు మొదలయ్యాయి. సర్పంచ్ లావణ్య ముఖ్య అతిథిగా విచ్చేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. కూడేరు, కరుట్లపల్లి, జల్లిపల్లి, మరుట్ల, కేజీబీవీ విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ అక్కులప్ప, హైస్కూల్ కమిటీ చైర్మన్ శాంతి భూషణ్, ఆయా హైస్కూల్స్ , పీడీలు పాల్గొన్నారు. శెట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం ఎస్జీఎఫ్ క్రీడా పోటీలను ఎంపీపీ లక్ష్మిదేవి ప్రారంభించారు. 12 పాఠశాలల నుంచి 250 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. ఇక్కడ ప్రతిభ చాటిన వారు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్ఎం ఫిరోజ్ ఖాన్, పీఈటీ ఎర్రిస్వామిలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు కుమార్, వివిధ పాఠశాలల పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు. అలాగే గుమ్మఘట్ట మండలంలోని నేత్రపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలు ఘనంగా నిర్వహించారు. పీడీలు హెచ్.నాగేంద్ర, విజయలక్ష్మి, క్రిష్ణవేణి, చంద్రకళ,ఎం.జాకీర్‌ల పర్యవేక్షణలో జరిగిన కబడ్డీ, ఖోఖో,టెన్నీకాయిట్, వాలీబాల్,త్రోబాల్, యోగా క్రీడాపోటీలు రసవత్తరంగా సాగాయి. కార్యక్రమంలో సర్పంచ్ వినూతమ్మ, ఎస్ఐ సునీత, ఎంపీటీసీ శ్యామలమ్మ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కుమారస్వామి, ప్రధానోపాధ్యాయుడు ఆదిశంకర్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.